సాక్షి హనుమకొండ

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతం

- 8లో ▸

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతమైందని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు.



మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారం

- 8లో ▸

మధ్యవర్తిత్వంతో వివాదాలు సులభంగా పరిష్కారమవుతాయని జస్టిస్ కె.లక్ష్మణ్, సభ్యులు జస్టిస్ జె.శ్రీనివాసరావు అన్నారు.

గరిష్టం/కనిష్టం 33^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పదోన్నతులతోపాటు బాధ్యతలూ పెరుగుతాయి



వరంగల్ క్రైం : ఉద్యోగులకు పదోన్నతులతోపాటు బాధ్యతలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన సుధాకర్, సంపత్ కుమార్, రవీందర్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, జె. శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, రమేశ్, ప్రభాకర్, కిషన్ రావు, రవీందర్, ప్రభాకర్, కీర్తి నాగరాజు, నరేందర్, వెంకటస్వామి గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై సీపీ స్వయంగా పట్టీలను అలంకరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులపై భరోసా, నమ్మకాన్ని కలిగించాలన్నారు. నిరుపేదలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

హన్మకొండ అర్బన్ : హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేడు (శుక్రవారం) పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ జరపనున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ అదాలత్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పెన్షన్, జీపీఎఫ్ కేసులు, ఖాతాల సమస్యలు చర్చించి పరిష్కరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఆయా ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

కేంద్ర మంత్రి నడ్డాను కలిసిన ఎంపీ కావ్య



హన్మకొండ చౌరస్తా: కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను త్వరితగతిన ప్రారంభించాలని మంత్రి నడ్డాకు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు ఎంపీ కావ్య తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ : మెరుగైన సేవల కోసం ప్రయాణికులనుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పుప్పాల అర్పిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (శుక్రవారం) ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, తరిగొప్పుల, పాలకుర్తి రూట్ ప్రయాణికులు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

నేటినుంచి టీజీఐసెట్ కౌన్సెలింగ్



రామన్నపేట: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం టీజీఐసెట్ –2025 మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా నేటి (శుక్రవారం) నుంచి వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్, వరంగల్ టీజీఐసెట్ హెల్ప్‌లైన్ క్యాంప్ ఆఫీసర్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. ఈనెల 29 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, 25 నుంచి 30వ తేదీ వరకు ఆప్షన్ ఎంట్రీ, 30న ఆప్షన్ ఫ్రీజింగ్, సెప్టెంబర్ 2 తేదీ లోపు సీట్ల ప్రొవిజనల్ అలాట్‌మెంట్, 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపు, స్వీయ రిపోర్టింగ్ ఉంటుందని వివరించారు. విద్యార్థులు తమ డాక్యుమెంట్లు ముందుగానే సిద్ధం చేసుకొని, సమయపాలన పాటించి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు.

అక్రమాలకు కేరాఫ్‌గా డీటీఓ కార్యాలయాలు!

- ఏసీబీ దాడులకు వెరవని రవాణాశాఖ అధికారులు
- వసూళ్లకు 'ప్రైవేట్' వ్యక్తులు, ఏజెంట్లే మధ్యవర్తులు
- కాసుల కక్కుర్తితో అడ్డంగా దొరికిపోతున్న అధికారులు
- ఆదాయాన్ని మించిన ఆస్తులు.. ఆ ఫిర్యాదులపైనే పలువురిపై దాడులు
- ప్రతి పనికీ రేటు.. ఇటీవలే రెండింతలు
- హనుమకొండ డీటీఓ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు



సాక్షిప్రతినిధి, వరంగల్:

రవాణాశాఖ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు ఆగడం లేదు. అన్ని పనులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఏజెంట్లు, ప్రైవేట్ వ్యక్తులు రూ.లక్షలకు పడగలెత్తుతుండగా.. అధికారుల ఆదాయం, అక్రమాస్తులకు హద్దూపద్దు లేదు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు జరిపిన దాడుల్లో వెల్లడవుతున్న ఆస్తుల వివరాలే ఇందుకు సాక్ష్యం. మే 7న ఏకంగా వరంగల్ డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంటిపై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై దాడులు చేసిన ఏసీబీ.. ఆ తర్వాత ఈ జిల్లాలో పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న జగిత్యాల డీటీఓ భద్రునాయక్ రూ.22 వేలు తీసుకుంటుండగా ఆగస్టు 6న పట్టుకున్నారు. తాజాగా వరంగల్, హనుమకొండలో ఎంవీఐగా పనిచేసిన జి.వివేకానంద రెడ్డి నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం రవాణాశాఖలో కలకలం రేపుతోంది. నెల రోజుల కిందట వివిధ పనుల కోసం ఏజెంట్ల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణల మేరకు వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించిన ఏసీబీ.. కొందరు సీనియర్ ఎంవీఐల ఆస్తులపై ఆరా తీస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

అంతులేని ఆదాయం.. పోస్టింగ్ కోసం పోటాపోటీ

రవాణాశాఖలో అంతులేని ఆదాయం ఉండటంతో కొందరు అధికారులు పోటీపడి పోస్టింగ్‌లు కొడుతున్నారు. కొందరు మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఇప్పుడు ఇన్‌చార్జ్ డీటీఓలుగా కూడా అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఇందులో కూడా కొన్నిచోట్ల సీనియర్‌లు తిరకాసు చేసి జూనియర్‌లను ముందుంచి తెరవెనుక అక్రమ ఆదాయమార్గాలపై చక్రం తిప్పుతున్నారు. హనుమకొండ డీటీఓ పోస్టు కూడా ఖాళీ అయిన సమయంలో వాస్తవానికి అదే కార్యాలయంలో సీనియర్‌గా ఉన్న 1994 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఎంవీఐ డీటీఓగా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అయితే తెరపైన కీలక పోస్టులో ఉండడం ఇష్టం లేక అతనే ఆ పోస్టుపై విముఖత చూపడంతో 2012 బ్యాచ్‌కు చెందిన ఒకరికి ఆ పోస్టు కట్టబెట్టి ఆ సీనియర్ ఎంవీఐ అన్నీ తానై చూస్తుండటం వల్లే మామూళ్లు రెండింతలయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలాఉంటే ఇన్‌చార్జ్‌ల కోసం అన్ని జిల్లాల్లో పోటీ ఉంది. వరంగల్‌లో ఎంవీఐగా ఉన్న ఒకరు మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీటీఓగా వ్యవహరిస్తుండగా, పెద్దపల్లి ఎంవీఐగా ఉన్న ఓ అధికారి ఆ పోస్టుతోపాటు ములుగు ఎంవీఐగా, ఇన్‌చార్జ్ డీటీఓగా వ్యవహరిస్తున్నారు. భూపాలపల్లిలో ఎంవీఐగా, ఇన్‌ఛార్జ్ డీటీఓగా ఒక్కరే చూస్తున్నారు. ఇలా.. ఏళ్లతరబడిగా ఉమ్మడి వరంగల్‌లో పాతుకుపోయిన కొందరు రవాణాశాఖ అధికారుల తీరుపై ఆ శాఖ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. హైదరాబాద్ స్థాయిలో పైరవీలు చేసుకుంటూ పోస్టుల్లో కొనసాగుతున్నారంటున్నారు. అక్రమ సంపాదనే లక్ష్యంగా కొత్త పద్ధతులు పెడుతూ అర్జీదారులనుంచి అడ్డగోలుగా వసూలు చేస్తూ చివరికి ఏసీబీకి చిక్కుతున్నారంటూ ఆ శాఖ ఉద్యోగులే చర్చించుకోవడం గమనార్హం. రవాణా శాఖలో పెచ్చుమీరుతున్న అవినీతిపై కొందరు అవినీతి నిరోధకశాఖ అధికారులు కూడా ద్వంద్వ వైఖరితో ఉన్నారన్న చర్చ జరుగుతోంది. వ్యక్తిగత పరిచయాల ఆధారంగా లెక్కకు మించిన అవినీతి జరిగినా ఆ కార్యాలయాలు, అధికారులపై ఉదాసీనంగా ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హనుమకొండ డీటీఓలో రెండింతలు పెరిగిన వసూళ్లు..

హనుమకొండ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వివిధ పనుల కోసం లంచాలు వసూలు చేస్తున్నారని, ఏజెంట్ల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది క్రితం వచ్చిన ఓ సీనియర్ ఎంవీఐ.. ఈ కార్యాలయానికి లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ కోసం వచ్చే వాళ్లనుంచి చేసే వసూళ్లు రెండింతలు చేశారన్న ఫిర్యాదులు కమిషనర్ కార్యాలయం వరకు వెళ్లాయి. లెర్నింగ్ లైసెన్స్‌కు ఏడాది కిందట రూ.500 వరకు తీసుకుంటే ప్రస్తుతం రూ.1,000కి పెంచారని, రూ.700–800లు ఉన్న లైసెన్స్ మామూళ్లు రూ.2,000లకు పెరిగిందని బాధితులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలు కొనుగోలు చేసుకొని వచ్చిన అర్జీదారుడికి అసలు కంటే కొసరే ఎక్కువగా భారమవుతుందని తెలుస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన అసలు సొమ్మును కట్టినా తనిఖీ అధికారులు కొసరుగా వేరే రేట్లను ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో ఒక్కో వాహనానికి రూ.2200 ఉంటే దానిని ఏకంగా రూ.5500 పెంచినట్లు ఆరోపణలున్నాయి. ఇలాగే ఇటీవల జూన్ మాసంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ ధరలు ఒక్కోబస్సుకు రూ.4,500ల వరకు వసూలు చేయడం వివాదాస్పదమైంది. కాగా ముఖ్యంగా వాహన ఫిట్‌నెస్‌లు, లెర్నింగ్ లైసెన్సు, డ్రైవింగ్ లైసెన్సుల ఫైళ్లపైనే కోడ్‌లు ఉండడం బహిరంగ రహస్యం. కోడ్‌లేని ఫైళ్లను.. చిన్న చిన్న పొరపాట్లను సాకుగా చూపుతూ కొర్రీలు పెడుతూ ఫిట్‌నెస్ అపడం.. వాహనదారుడు దానికి వేరే రేటు ఇచ్చుకుంటే పూర్తి చేయడం ద్వారా రూ.వేలు చేతులు మారుతున్నాయి.

అభివృద్ధి పనులు మరింత పారదర్శకం

- కలెక్టర్ స్నేహ శబరీష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా, ఫలప్రదంగా ఉండేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ .. అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పనుల జాతర – 2025 ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆగస్టు 22న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రూ.15.61 కోట్లతో 2,802 పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. వీటిల్లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు భాగస్వాములు కావాలని తెలిపారు. ఆగస్టు 22న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో గత సంవత్సరం చేపట్టి పూర్తయిన పనులను ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ప్రారంభోత్సవాలు, కొత్తగా చేపట్టిన పనుల భూమి పూజ చేసి మొదలుపెట్టించాలని ఆదేశించారు. వనమహోత్సవం నిర్వహించి పండ్లు, నీడ నిచ్చే మొక్కలను నాటించాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీను, తదితర అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ

హన్మకొండ: అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పర్యావరణ అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హనుమకొండ రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్య శారద, స్నేహ శబరీష్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి రెండు జిల్లాల్లో వివిధ అభివృద్ధి పనులు, వాటి పురోగతి, ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పరిస్థితులపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేయించాలని ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కల త్వరలో సాకారం కానుందని, ఇందుకు అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. 2057 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూ.4,170 కోట్లతో వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాల్సి ఉందన్నారు. భద్రకాళి ఆలయ మాడ వీధులతోపాటు కల్యాణ మండపం, పూజారి నివాసం, విద్యుత్ అలంకరణలను వచ్చే దసరా నాటికి అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రణాళికను రూపొందించుకొని పనిచేయాలని ఆదేశించారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వరంగల్ బస్ స్టేషన్, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్, ఇందిరమ్మ ఇళ్ల, డబుల్ బెడ్రూంలు, ఇతర అభివృద్ధి పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, సాగునీటి పారుదల శాఖ సీఈ వెంకటేశ్వర్లు, ఎస్ఈ రాంప్రసాద్, 'కుడా' పీఓ అజిత్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



ముల్కనూరు కస్తూర్బా విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



డాక్టర్ సరితను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ముల్కనూరులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కూరల్లో నీళ్లు ఎక్కువగా ఉన్నాయని, ఫుడ్ పాయిజన్ కాకుండా నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఓ జ్యోతికి సూచించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఔషధ నిల్వలు, ఫీవర్ సర్వే, సుఖ ప్రసవాలు, తదితర అంశాల నమోదు తీరును డాక్టర్ ప్రదీప్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

ఉనికచర్లలో ఇసుక బజార్ ఏర్పాటు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల కోసం మూడు రోజుల క్రితం ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల గ్రామంలో ఇసుక బజార్‌ను ప్రారంభించినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ ఇసుక బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టన్నుకు ఇసుక రూ.వెయ్యి ఉంటుందని, రవాణా ఖర్చులు అదనంగా చెల్లించాలన్నారు. త్వరలో భూ భారతి దరఖాస్తులను పరిశీలిస్తామని, వారసత్వం, మ్యుటేషన్, మిస్సింగ్, సర్వేనంబర్ల దరఖాస్తులను దశలవారీగా పరిశీలించి సర్వే అనంతరం పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, విజయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.

యోగా ఇన్‌స్పెక్టర్‌కు మెమో జారీ చేయండి

విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న భీమదేవరపల్లి మండలం ముల్కనూరు ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల యోగా ఇన్‌స్పెక్టర్‌కు మెమో జారీ చేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి.. ఆ వైద్యశాల డాక్టర్ సరితకు ఆదేశాలు జారీ చేశారు. హోమియోపతి వైద్యశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో యోగా ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సురేశ్ కొద్ది రోజులుగా విధులకు గైర్హాజరు అవుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో వైద్యాధికారి డాక్టర్ సరితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతడి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని, మెమో జారీ చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రజలు శారీరక రుగ్మతల బారిన పడకుండా హోమియో వైద్యశాలల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి యోగా శిక్షణ అందిస్తున్నామన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

పూర్వ ప్రాథమిక తరగతులకు నిధులు

- కొన్నింటికి రూ.1.70లక్షలు, మరికొన్నింటికి రూ.50వేల చొప్పున విడుదల
- తరగతి గదికి కలర్, ఆటవస్తువులకు, విద్యార్థులకు బ్యాగ్, షూస్, టై, బెల్టులు
- త్వరలోనే ఆయాలు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకం



విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరంనుంచి పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలు పాఠశాలల్లో చిన్నారులకు అడ్మిషన్లు కల్పించారు. ప్రభుత్వం తాజాగా సమగ్ర శిక్ష ద్వారా పూర్వ ప్రాథమిక తరగతుల విద్యార్థుల కోసం నిధులు మంజూరు చేసి విడుదల చేసింది. ఒక్కో స్కూల్‌కు రూ.1.70లక్షల నిధులను కలెక్టర్లకు జమ చేశారు. హనుమకొండ జిల్లాలో 45 పూర్వ ప్రాథమిక తరగతులకు నిధులు మంజూరై విడుదలయ్యాయి. అందులో 25 స్కూళ్లకు రూ.1.70లక్షల చొప్పున, మరో 20 స్కూళ్లకు రూ.50వేల చొప్పున నిధులు మంజూరు చేశారు.

రంగులు, విద్యార్థులకు ఆట వస్తువులు

ఆయా పాఠశాలల్లోని పూర్వ ప్రాథమిక తరగతి గదికి రూ.50వేలు వెచ్చించి రంగులు వేయించాల్సి ఉంటుంది. ఆట వస్తువులు కొనుగోలు చేయాలి. ఒక్కో విద్యార్థికి రూ.1,000 కేటాయించి బ్యాగ్, షూస్, బెల్ట్, టై తదితర వస్తువులు కొనుగోలు చేయాలి. ఈ నిధులు జిల్లా కలెక్టర్లకు విడుదల చేసిన నేపథ్యంలో వాటిని ఎలా వినియోగించుకోవాలనే విషయంపై కూడా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్.. డీఈఓలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. త్వరలోనే జిల్లాల కలెక్టర్లు ప్రతీ పూర్వ ప్రాథమిక తరగతి విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు ఒక ఆయా, ఒక ఇన్‌స్ట్రక్టర్ నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం.

జిల్లాల వారీగా పాఠశాలలకు నిధులు మంజూరు ఇలా..(రూ.లక్షల్లో)

జిల్లా	పాఠశాలలు	నిధులు
హనుమకొండ	65	52.50
వరంగల్	32	54.40
ములుగు	08	13.60
మహబూబాబాద్	22	37.40
భూపాలపల్లి	54	78.60
జనగామ	15	21.90

ఐనవోలు ధర్మకర్తల మండలి నియామకం

- నేడు ఛైర్మన్ ఎన్నిక

ఐనవోలు: సుప్రసిద్ధ ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి సంవత్సర కాలపరిమితితో ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ జీఓ నంబర్ 325 ద్వారా ఈ నెల 18న ఉత్తర్వులు వెలువరించారు. ఇందులో 13 మంది సభ్యులు, ఒక దాత, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడు ఉన్నారు. నేడు (శుక్రవారం) మధ్యాహ్నం 3 గంటలకు ఆలయంలో సభ్యులు గోప్యత, ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఈఓ కందుల సుధాకర్ తెలిపారు. సభ్యులు అందులో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకోనున్నారు.

మండలి సభ్యులు వీరే..

ధర్మకర్తల మండలిలో సభ్యులుగా కమ్మగోని ప్రభాకర్‌గౌడ్ (కొత్తపల్లి), కూస చిరంజీవి (పెరుమాండ్లగూడెం), గడ్డం రేణుక (ఐనవోలు), బరిగెల ఆనందం (ఐనవోలు), నూనావత్ కీమా (డీసీ తండా), గుంటి కుమారస్వామి (ఇల్లంద), ధరం పూర్ణచందర్ (పర్వతగిరి), బందెల వెంకన్న(దౌలత్ నగర్), బోయిని మహేందర్ (వెంకటాపురం), బాలబోయిన రాజయ్య (గర్మిళ్లపెల్లి), మందల నర్సింహారెడ్డి (కొండపర్తి), మదూరి రాజు (పంథిని), పోలెపల్లి బుచ్చిరెడ్డి (నర్సింహులగూడెం), దాతగా సిరిమిల్ల వరలక్ష్మి (రంగారెడ్డి జిల్లా) ఉన్నారు. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఉన్నారు.

మాజీ కౌన్సిలర్ సహా కుమారుడిపై దాడి



మాజీ కౌన్సిలర్ సహా కుమారుడిపై దాడి చేస్తున్న వ్యక్తులు



దాడినుంచి భర్తను కాపాడుకునేందుకు అడ్డుగా నిలిచిన భార్య రజిత

- భార్య అడ్డుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు
- పోలీసులను ఆశ్రయించిన ఇరువర్గాలు

పరకాల: పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అల్లె దశరథంతోపాటు అతడి కుమారుడు ప్రశాంత్‌పై నడిరోడ్డుపై దాడి చేశారు. ఈ ఘటన పరకాలలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గురువారం ఈ వీడియో వైరలైంది. రెండు నెలల్లో రెండుసార్లు అల్లె దశరథంపై దాడి జరగడం స్థానికంగా కలకలం రేపుతోంది. పాత గొడవల కారణంగా ఈ దాడులు జరిగినట్లు సమాచారం. దశరథం ఇటీవల అంబాల రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా కొందరు వ్యక్తుల చేతుల్లో గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువకముందే బుధవారం వెల్లంపల్లి రోడ్డులోని బంధువుల శుభకార్యం వద్ద జరిగిన వివాదం చివరకు మాజీ కౌన్సిలర్ అల్లె దశరథంతోపాటు అతడి కుమారుడు దాడికి దారితీసినట్లు సమాచారం. తండ్రీకొడుకులిద్దరిని నలుగురు వ్యక్తులు నడిరోడ్డుపై కొట్టుకుంటూ తీసుకెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దశరథం భార్య రజిత ఒకవైపు భర్తను.. మరోవైపు రోడ్డుపై పడిపోయిన కొడుకును కొట్టొదంటూ అడ్డుకోవడానికి ప్రయత్నించింది. ఈ ఘటనపై ఇరువర్గాలు స్థానిక పోలీసులను ఫిర్యాదు చేసుకోగా కేసు నమోదు చేశారు. ఓ ఫంక్షన్ వద్ద జరిగిన వివాదం దాడికి దారితీసినట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయుధాలతో దాడులు చేసుకున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.





సందల్ ఉత్సవం

హనుమకొండ దర్గాకాజీపేటలో గురువారం అర్ధరాత్రి కనుల పండువగా హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని రహమతుల్లా అలైహ్ ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి ఖుస్రూపాషా ఆధ్వర్యంలో సందల్ ఉత్సవం పురవీధుల్లో కొనసాగింది.

- కాజీపేట

490మంది ఎస్‌ఏలకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు

విద్యారణ్యపురి: మల్టీజోన్ –1 పరిధి వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలోని 19 జిల్లాల్లోని 490మంది స్కూల్ అసిస్టెంట్‌లకు హెడ్మాస్టర్లు (గ్రేడ్–2) పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇందులో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని హైస్కూల్స్‌కు 53మంది స్కూల్ అసిస్టెంట్‌లు హెడ్మాస్టర్లుగా, లోకల్ బాడీ యాజమాన్యాల పరిధిలోని 437 మంది ఎస్‌ఏలు హెడ్మాస్టర్లుగా పదోన్నతి పొందారు. వీరు తమకు కేటాయించిన హైస్కూల్స్‌లో జాయిన్ అయ్యేందుకు 15 రోజుల సమయం ఉంటుంది. కానీ ఆయా స్కూల్ అసిస్టెంట్‌లు ఎక్కువశాతం మంది ఈ నెల 22న రిలీవ్ అయి వెంటనే హెడ్మాస్టర్లుగా జాయిన్ కానున్నారని సమాచారం.

నేటినుంచి దూరవిద్య డిగ్రీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీఎస్సీ మొదటి, ద్వితీయ, ఫైనలియర్ ఎక్స్, రెగ్యులర్ విద్యార్థులకు ఈనెల 22 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ గురువారం తెలిపారు. ఈనెల 22, 26, 30, సెప్టెంబర్ 3, 8,11 తేదీల్లో ఫైనలియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దూరవిద్య డిగ్రీ సెకండియర్ విద్యార్థులకు ఈనెల 23, 28,సెప్టెంబర్ 1, 4, 9, 11, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 25, 29,సెప్టెంబర్ 2, 6, 10, 15, 18వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పద్మజ తెలిపారు. కేయూ దూరవిద్య కేంద్రం పరిధిలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,200 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని పద్మజ తెలిపారు.

ఏటీఎం గోడను ఢీకొట్టిన గూడ్స్ రైలు

- వరంగల్ రైల్వే స్టేషన్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు పార్కింగ్ కోసం గురువారం ఉదయం వెనక్కి ప్రయాణిస్తూ ఏటీఎం గోడను ఢీకొట్టింది. దీంతో ఎవరికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగపోవడం అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన తెలిసిన ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై వెంకటేశ్వర్లు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్ ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గూడ్స్ రైలు ఢీకొట్టిన ఏటీఎం గోడను పరిశీలించారు. రైలు వెనక్కి వెళ్తూ అకస్మాత్తుగా గోడను ఢీకొట్టిందన్నారు.

ప్రదీప్‌రావు ప్యానల్ ఘన విజయం



ప్రదీప్‌రావును ఎత్తుకున్న అనుచరులు

రామన్నపేట : వరంగల్ కో–అపరేటివ్ బ్యాంకు కార్యవర్గ ఎన్నికల్లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్యానల్ ఘన విజయం సాధించింది. గురువారం నగరంలోని ఏవీవీ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 6,638 ఓట్లు ఉండగా ఇందులో 2,442 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి వాల్యానాయక్ తెలిపారు. వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రదీప్ రావుకు 2,166 ఓట్లు సాధించి భారీ మోజార్టీతో విజయం సాధించారు. అదేవిధంగా ప్రదీప్‌రావు ప్యానల్ సభ్యులంతా ఘన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి వాల్యానాయక్ తెలిపారు.

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతం

- టాస్ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రావు
- ముగిసిన సైన్స్ కాంగ్రెస్



సైన్స్ కాంగ్రెస్ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న టాస్ అధ్యక్షుడు మోహన్‌రావు, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవంలోకి అడుగిడిన వేళ తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతమైందని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) అధ్యక్షుడు, హైదరాబాద్ సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సి.హెచ్. మోహన్‌రావు అన్నారు. మూడురోజులుగా యూనివర్సిటీలో 'ఇన్నోవేటివ్ స్కిల్ ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్స్‌అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' అనే అంశంపై నిర్వహించిన తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్ గురువారం ముగిసింది. ఈ ముగింపు సభలో మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధిలో సైన్స్‌కీలకమన్నారు. ఈసభకు అధ్యక్షత వహించిన కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ,స్పేస్, క్వాంటం పరిశోధన అంశాలు విద్యార్థులు, పరిశోధకుల్లో ఆసక్తి రేకిత్తించాయన్నారు. తెలంగాణ అకాడమీ సైన్సెస్ జనరల్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక పురోగతే లక్ష్యంగా తెలంగాణ అకాడమి పనిచేస్తుందన్నారు. కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం మాట్లాడుతూ శాస్త్రవేత్తల నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలన్నారు. తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ 48 ఆహ్వానిత లెక్చర్స్, ఐదు ప్లీనరీలెక్చర్లు, 164 ఓరల్ ప్రజెంటేషన్లు, పోస్టర్ ప్రజెంటేషన్లు కొనసాగాయన్నారు. మొత్తం 780 మంది పరిశోధకులు తమ పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. టాస్ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ట్రెజరర్ ఎస్‌ఎం రెడ్డి, వివిధ డీన్లు బి. సురేశ్‌లాల్, జి. హనుమంతు, గాదె సమ్మయ్య, సదానందం తదితరులు మాట్లాడారు. ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని కొట్టిపారేయలేం..

- కృత్రిమం కంటే సహజసిద్ధ డైమండ్ విలువైనది
- తిరువనంతపురం ప్రొఫెసర్ ఎస్.వి. చలపతి



మాట్లాడుతున్న తిరువనంతపురం ప్రొఫెసర్ చలపతి, ఇక్రిశాట్ సైంటిస్ట్ ప్రొఫెసర్ నారాయణరావు, ప్రొఫెసర్ రఘురాం

కేయూ క్యాంపస్: ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని కొట్టిపారేయలేమని తిరువనంతపురం ఇస్రో ఎన్ఈఎస్ఎస్ ప్రొఫెసర్ ఎస్.వి.చలపతి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం 'డైమండ్స్ ఫ్రమ్ ధేర్ బర్త్‌టూ ఎటర్నిటీ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూగోళశాస్త్రం ఎంతో గొప్పదన్నారు. కృత్రిమ డైమండ్స్‌పై మోజుపెరిగినా సహజసిద్ధమైన డైమండ్ విలువైందన్నారు. భారతీయ డైమండ్ మార్కెట్ ప్రపంచంలో చాలాపెద్దదన్నారు.

ఇంజనీరింగ్ టెక్నాలజీలో నూతన ఆలోచనలకు పదును..

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ సి. రాఘవేంద్రరావు అన్నారు. 'సుర్రోగేట్స్ అండ్ అప్రాక్సిమేషన్స్ ఫర్‌ఇంజనీరింగ్ స్పేస్‌టెక్నాలజీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. అలాగే, 'స్పేస్‌టెక్నాలజీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై హైదరాబాద్‌లోని జీపీ బిర్లా సైంటిఫిక్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కె. మృత్యుంజయరెడ్డి.. స్పేస్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

కలుషు నివారణలో సాంకేతికత..

కలుషునివారణలో సాంకేతికత ప్రధాన భూమికపోషిస్తుందని ఇక్రిశాట్ సైంటిస్ట్ ప్రొఫెసర్ ఎ. నారాయణరావు అన్నారు. 'క్లైమేట్ రిసిలిఎంట్ ఇంటిగ్రేటెడ్ విత్ మేనేజ్‌మెంట్'అనే అంశంపై ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ కిశోర్‌నట్టి.. రసాయన, ఔషధ పరిశ్రమలో ఉపయోగించే ఉత్ప్రేరక సమ్మేళనాల ప్రభావ పాత్రను వివరించారు. ముంబాయి బాబా అటమిక్ రీసెర్చ్‌సెంటర్ సైంటిస్ట్ డి. విద్యాసాగర్ మాట్లాడుతూ రేడియోలాజికల్ అత్యవసర పద్ధతులకు సిద్ధంగా ఉండాలన్నారు. బెంగుళూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ తిరుపతి.. మానవశరీరంలోని సమీకరణాలు, ప్రవేశ విలువలు, షరతుల గురించి వివరించారు. కేన్సర్ నివారణపై రిటైర్డ్ ప్రొఫెసర్ రామ్ బాహు వివరించారు.

పర్యావరణంపై గంభీర సవాళ్లు..

ఆహార ఉత్పాదకతకు అత్యవసరమైన నత్రజని, భాస్వరం సమ్మేళనాలు వ్యవసాయం, వ్యర్థ పదార్థాల నిర్వహణలో సరైన విధంగా ఉపయోగించుకోకపోవడంతో పర్యావరణానికి సవాళ్లు ఎదురవుతున్నాయని న్యూఢిల్లీ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ ప్రముఖ వైజ్ఞానిక్ ప్రొఫెసర్ నందుల రఘురాం అన్నారు. 'పోషకవనరుల నిర్వహణ –పర్యావరణం' అనేఅంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ పద్ధతుల్లో మార్పు తీసుకురావాలన్నారు.

బాలుర గురుకుల పాఠశాల, కళాశాల తనిఖీ



ఆర్ట్ గ్యాలరీని పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

మడికొండ: మడికొండలోని సాంఘిక సాంక్షేమ బాలుర(వర్ధన్నపేట) పాఠశాల, కళాశాలను గురువారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, డైనింగ్ హాల్, పరిసరాలు పరిశీలించారు. డైలీ మెనూ ప్రకారం విద్యార్థులకు వంటకాలు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని సూచించారు. జేఈఈ, నీట్ పరీక్షల ప్రిపేర్ అవుతున్న ఇంటర్ సెకండియర్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దాసరి ఉమామహేశ్వరీ, ప్రిన్సిపాల్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

హన్మకొండ అర్బన్: పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఫేస్ క్యాప్చర్ (ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఒకే ఆన్‌లైన్ యాప్ విధానం ఉండేలా నిర్ణయించాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు అంగన్వాడీలు ప్రదర్శన నిర్వహించి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ విద్యా వలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని వీరికి అదనంగా చెల్లించాలన్నారు. అదనపు పనులు రద్దు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు నిడిగొండ రజిత, రమాదేవి, శోభారాణి, జమున, జోష్న, ప్రసన్న, రమాదేవి, రాజేశ్వరి, హైమావతి, శోభారాణి, వసంత, కిరీట, స్వరూపారాణి, ఉమాదేవి, బేబీ రాణి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాల ద్వారా గుణాత్మక విద్య

- డీఈఓ వాసంతి

హసన్‌పర్తి: బోధనోపకరణాల ద్వారా గుణాత్మక విద్యనందించవచ్చని హనుమకొండ డీఈఓ వాసంతి అన్నారు. హసన్‌పర్తి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం మండల స్థాయి బోధనాపకరణాల కృత్యమేళా నిర్వహించగా డీఈఓ సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధనలో టీఎల్‌ఎంను ఉపయోగించాలన్నారు. ఈ సందర్భంగా పది ఉత్తమ బోధనోపకరణాల ప్రదర్శనలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. అనంతరం పీఎంశ్రీ హసన్‌పర్తి జెడ్పీ బాలికల పాఠశాలను డీఈఓ సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంపత్, రవికుమార్, రమాదేవి, లక్ష్మీరాజ్యం, మాధవిలత, డీఆర్పీలు పాల్గొన్నారు.

ఈ-సైన్‌తో రిజిస్ట్రేషన్లు షురూ

- పైలెట్ ప్రాజెక్ట్‌లో వరంగల్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

కాజీపేట అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు ఆధునిక టెక్నాలజీతో ముందడుగు వేస్తోంది. ఇప్పటికే 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు స్లాట్ బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులో తీసుకురాగా.. మరో అడుగు ముందుకు వేసి ఈ–సైన్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియను తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ–సైన్ విధానానికి గత నెలలో శ్రీకారం చుట్టి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంపిక చేసింది. సబ్ రిజిస్ట్రార్ సైదులు గురువారం ఈ–సైన్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి దస్తావేజులను భూక్రయదారులకు అందజేశారు. ఇక దస్తావేజుల్లో సబ్ రిజిస్ట్రార్, భూక్రయవిక్రయదారుల సంతకాలు ఉండవు. ఈ –సైన్ సాఫ్ట్‌వేర్‌తో ఆధార్‌ను అనుసంధానం చేస్తూ కేవలం గ్రీన్ రైట్ టిక్‌తో రిజిస్ట్రేషన్లకు రైట్ చెప్పనున్నారు.త్వరలో మిగతా12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ రిజిస్ట్రేషన్ అందుబాటులోకి రానుంది.

సీజన్ వ్యాధులపై అప్రమత్తం

హసన్‌పర్తి: సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. హసన్‌పర్తి ప్రాథమిక కేంద్రం పరిధి జయగిరి, అన్నాసాగరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్‌లను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులతో ముచ్చటించారు. ఆరోగ్య కేంద్రాలను ప్రతీరోజు తెరుస్తున్నరా అని అడిగి తెలుసుకున్నారు. టీబీ స్క్రీనింగ్, హైపర్ టెన్షన్, డయాబెటీస్‌తో బాధపడుతున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరం బారిన పడిన వారిని గుర్తించి ప్రాథమిక చికిత్స అందించడమే కాకుండా రక్త సమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కోతి దాడిలో గాయపడి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓ బాలింతకు దగ్గర ఉండి వ్యాక్సిన్ ఇప్పించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ భార్గవ్, పల్లె దవాఖానా వైద్యులు పాల్గొన్నారు.

నేడు 'పనుల జాతర'

- వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.25.31 కోట్ల వ్యయంతో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు, కొత్త పనులకు భూమి పూజలతో పనుల జాతర–25 పేరిట శుక్రవారం (నేడు) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాలోని 11 మండలాల పరిధి 317 గ్రామాల్లో ఒకే రోజు కొత్త పనులకు భూమి పూజ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద కూలీ కుటుంబాల జీవనోపాధులు మెరుగు పర్చేందుకు ఈఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పాటు పని కల్పించడానికి ప్రభుత్వం సంకల్పించందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో రూ.11.14 కోట్లతో 3,003 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.7.26 కోట్ల వ్యయంతో 2,870 పనులు చేపట్టనున్నట్లు, వీటితో స్వచ్ఛభారత్ ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యునిటీ సోక్‌పిట్స్, పంచాయతీ రాజ్ ద్వారా గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, రూ.3 కోట్ల వ్యయంతో 19 పనులకు జిల్లా వ్యాప్తంగా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పనుల ప్రారంభోత్సవాలు, భూమి పూజలు జరుగనున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు..

మహిళా రిమాండ్ ఖైదీ మృతి

నర్సంపేట రూరల్/వరంగల్‌క్రైం : వరంగల్ జిల్లా నర్సంపేట సబ్‌జైలులో రిమాండ్‌లో ఉ న్న ఓ మహిళా ఖైదీ గురువారం చనిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఓ కేసులో నిందితురాలైనా పెండ్యాల సుచరిత (36) నర్సంపేట సబ్ జైలుకు ఈనెల 13న రిమాండ్ నిమిత్తం తీసుకొచ్చారు. బుధవారం జనరల్ చెకప్‌లో భాగంగా ఆమెను నర్సంపేట ప్రభు త్వ ఆస్పత్రిలో చూపించారు. అన్ని రిపోర్టులు నార్మల్‌గానే వచ్చాయి. ఈ క్రమంలో గురువా రం ఉదయం సుచరితకు కడుపునొప్పి వస్తుందని బాత్‌రూమ్‌కు వెళ్లి అక్కడే కుప్పకూలి కిందపడిపోయింది. వెంటనే జైలు సిబ్బంది ఆమెను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతిచెందిన ట్లు ధ్రువీకరించారు. వెంటనే మృతదేహాన్ని పో స్టుమార్టం నిమిత్తం తరలించారు. జైలు సిబ్బంది ఫిర్యాదు మేరకు నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు. దీనిపై నర్సంపేట జైలర్ లక్ష్మీశృతిని వివరణ కోరగా సుచరిత ఉదయం బా గానే ఉందని, ఒక్కసారిగా కిందపడిపోవడంతో ఆస్పత్రికి తరలించామని, పోస్టుమార్టం అయితేనే పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. తన సోదరి మృతిపై అనుమా నాలు ఉన్నాయని సుచరిత సోదరుడు పుట్ట సంతోష్ గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గతంలోనూ సుచరితపై కేసులు

సుచరిత భర్త ఏడాదిక్రితం చనిపోయాడు. ప్రస్తుతం హనుమకొండలోని ఓ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ఇతర మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తుంటుంది. ఈమె పై గతంలోనూ మామునూరు, సుబేదారి పీఎస్ ల్లో కేసులు కూడా నమోదైనట్లు సమాచారం.

గుణాత్మక విద్యనభ్యసిస్తూ ఎదగాలి

ఖిలా వరంగల్: దైనందిన జీవితాన్ని సుఖమయం చేసుకోవడంతోపాటు గుణాత్మక విద్యనభ్యసిస్తూ ఎదగాలని డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ దివ్యాంగ విద్యార్థులకు సూచించారు. గురువారం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ సౌజన్యంతో కృత్రిమ అవయవాల వినియోగం, ఉపయోగాలపై దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు.

మధ్యవర్తిత్వంతో వివాదాలు సులభంగా పరిష్కారం



శిక్షణ పొందిన న్యాయవాదులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న న్యాయమూర్తులు నిర్మలా గీతాంబ, పట్టాభిరామ్

- జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు

వరంగల్ లీగల్ : మధ్యవర్తిత్వంతో వివాదాలు సులభంగా పరిష్కారమవుతాయని మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ సెంటర్ పాలకమండలి అధ్యక్షులు జస్టిస్ కె.లక్ష్మణ్, సభ్యులు జస్టిస్ జె.శ్రీనివాసరావు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా జిల్లాల న్యాయసేవాధికాసంస్థలు గుర్తించిన మధ్యవర్తిత్వం భావన, సాంకేతికతలపై సాధికారత పొందిన న్యాయవాదుల ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం వరంగల్ టెన్ కోర్టు కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు వర్చువల్‌గా హాజరుకాగా తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్. పంచాక్షరి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా రెండు పక్షాల వారికి సమయం, డబ్బు ఆదా అవడంతోపాటు శాంతి, సామరస్యంగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఇది కక్షిదారుల చాలా ప్రయోజనం చేస్తుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన న్యాయవాదులకు సభ్య కార్యదర్శి సి.హెచ్. పంచాక్షరి, వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి నిర్మలా గీతాంబ, డాక్టర్ కె.పట్టాభిరామ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు నారాయణబాబు, మనీషా శ్రావణ్ ఉన్నమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థల కార్యదర్శులు సాయికుమార్, క్షమాదేశ్ పాండే, ఇతర న్యాయమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల న్యాయపోరాటం ఫలించింది

- సీబీసీ ప్రెసిడెంట్ విజయ్‌స్వరూప్



మాట్లాడుతున్న సీబీసీ ప్రెసిడెంట్ విజయ్ స్వరూప్

హన్మకొండ చౌరస్తా: క్రైస్తవ మిషనరీ ఆస్తుల పరిరక్షణ కోసం మూడు దశాబ్దాల పాటు సాగిన న్యాయపోరాటం ఫలించిందని హనుమకొండ సెంటనరీ బాప్టిస్టు చర్చి ప్రెసిడెంట్ తాళ్లపెల్లి విజయ్‌స్వరూప్ అన్నారు. హనుమకొండలోని మిషన్ ఆస్పత్రి ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల కోట్ల విలువైన మిషనరీ ఆస్తులను కొందరు అక్రమంగా అమ్ముకున్నారని, ఆస్తుల పరిరక్షణ కోసం ముప్పై ఏళ్ల క్రితం డి. జయరాజ్ మరో నలుగురితో కలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. మూడు దశాబ్దాల పోరాటం తర్వాత మద్రాస్ హైకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిందన్నారు. 2,000 సంవత్సరం తర్వాత అక్రమంగా అమ్మిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు భవిష్యత్‌లో అమ్మేందుకు ఎవరికి హక్కు లేదంటూ తీర్పు వెలువరించిందన్నారు. కాగా, మిషనరీ ఆస్తుల పరిరక్షణకు జరిగిన న్యాయపోరాటంలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సాయం మరవలేనిదని, ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది రాంగోపాల్‌రావు, నెల్లూరుకు చెందిన క్రైస్తవులు అనిల్ కుమార్, సునీల్‌కుమార్, సీబీసీ సెక్రటరీ క్రిష్టోఫర్ రూబెన్, జాయింట్ సెక్రటరీ విద్యాకర్, ట్రెజరర్ విల్సన్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లు మార్గ నిర్దేశకులు

- వరంగల్ న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ



మాట్లాడుతున్న న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్: ప్రస్తుత సమాజానికి సీనియర్ సిటిజన్లు మార్గదర్శకులని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వీబీ నిర్మలా గీతాంబ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి యం.సాయికుమార్ అధ్యక్షతన జిల్లా కోర్టులో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ హాజరై మాట్లాడుతూ.. తల్లిదండ్రులను దైవసమానులుగా భావించినప్పుడే జీవితానికి అర్థమన్నారు. చట్టపరమైన వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ సమాజంలో గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలను ఆచరణ రూపంలోకి తీసుకొచ్చేలా న్యాయసేవాధికార సంస్థలు కృషి చేస్తాయని తెలిపారు. కుటుంబాల్లోని వయోవృద్ధులు ఎలాంటి ఇబ్బందులకు గురవకుండా కుటుంబ సభ్యులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, సీనియర్ న్యాయవాది తీగల జీవన్ గౌడ్, న్యాయవాదులు, ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడికి ఏడాది జైలు, జరిమానా



గిరికుమార్, సైబర్ క్రైమ్ డీఎస్పీ, వరంగల్

వరంగల్ క్రైం : ఓ సైబర్ నేరస్తుడికి హనుమకొండ జిల్లా మూడో అదనపు జూనియర్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి.. ఏడాది 29 రోజుల జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధించినట్లు వరంగల్ సైబర్ క్రైం డీఎస్పీ కలకోట గిరికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జార్ఖండ్‌లోని జంతారా జిల్లాకు చెందిన బిదూర్ మహాతో తరచూ ఆన్‌లైన్, చాటింగ్ మోసాలకు పాల్పడుతున్నాడు. మహాతోపై కమిషనరేట్ పరిధిలోని కేయూ పీఎస్‌లో 2, సుబేదారి పీఎస్‌లో 2, మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. ఈ క్రమంలో ఇటీవల ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు అధికారినంటూ నగరానికి చెందిన జూపాక అర్చనకు ఫోన్ చేసి రూ.63,837 బదిలీ చేయించుకుని మోసం చేశాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేయూ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా, విచారణ అధికారి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు బిదూర్ మహాతోకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్ లేదా cybercrime.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలా ఫిర్యాదు చేయడం వల్ల కోర్టుల ద్వారా నిందితులకు శిక్ష పడడంతో పాటు మోసపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

స్తంభాలపై కేబుళ్లు క్రమపద్ధతిలో బిగించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు

హన్మకొండ: విద్యుత్ స్తంభాలపై కేబుళ్లను క్రమపద్ధతిలో అమర్చాలని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.మధుసూదన్ రావు అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని సర్కిల్ కార్యాలయంలో జరిగిన కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్ నెట్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్డదిడ్డంగా ఉన్న కేబుళ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో కేబుళ్లను సక్రమంగా అమర్చుకోవాల్సిన బాధ్యత ఆపరేటర్లపై ఉందన్నారు. ఇప్పటికే తాము ఒక సారి సూచించామని, స్పందన రాకపోవడంతో తామే కేబుళ్లను తొలగించాల్సి వచ్చిందన్నారు. అయినా వాటిని సరిదిద్దడానికి మరోసారి అవకాశమిస్తున్నామన్నారు. ఈ నెల 26 లోపు హనుమకొండ జిల్లాలో స్తంభాలకు ఉన్న కేబుళ్లను పద్ధతి ప్రకారం అమర్చుకోవాలన్నారు. అదే విధంగా అన్‌యూజుడ్ కేబుళ్లను తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆపరేటర్లకు నోటీసులు అందించారు. సమావేశంలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి, ఎస్ఏఓ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సందల్ ఉత్సవం



దర్గా వద్ద భక్తుల సందడి

కాజీపేట: దర్గా కాజీపేటలో గురువారం అర్ధరాత్రి హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ రహమతుల్లా అలైహి ఉర్సు ఉత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేశ, విదేశాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తుల మధ్య దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా ఆధ్వర్యంలో నిర్వహించిన సందల్ ఉత్సవం ఘనంగా ముగిసింది. మహిళలు రెండు రోజులపాటు శ్రమించి తయారు చేసిన మంచి గంధాన్ని వెండి పళ్లెంలోకి తీసుకుని ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రం కప్పి పురవీధుల్లో సందల్ ఊరేగింపు నిర్వహించారు. దేశంలోని 25 దర్గాలకు చెందిన పీఠాధిపతుల చేతుల మీదుగా దర్గాకు సందల్‌ను లేపనం చేయడంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఖుస్రూపాషా ప్రకటించారు. మూడు రోజులపాటు సాగే ఈఉత్సవాల్లో వేలాది మంది భక్తులు బియాబాని దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, సీఐ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకన్నతో పాటు సబ్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.